ఓం గురవేనమ:

ప్రబోధ శతకము

PRABODHA SHATAKAMU



1982

రచయిత:

వి. వీరబ్రహ్మము,


ప్రబోధ పబ్లికేషన్,

ప్రబోధాశ్రమము.

రైల్వే స్టేషన్ దగ్గర, ... తాడిపత్రి.

వెల: 1–00.

ప్రబోధ శతకము



గురు దేవుడు

ప్రథమముద్రణ	ప్రతులు	వెల
1982	1000	1-00

రచయిత తొలిపలుకులు

పరమాత్మ స్వరూపులారా!

నేను విశ్వబ్రాహ్మణ వంశజులైన ఒక పుణ్యదంపతుల గర్భ వాసమున జన్మించిన శరీరమున కర్మ బద్ధుండనై జేరి వీర బ్రహ్మ నామధేయుండనై ఈ ప్రపంచమున దిరుగుచున్న ఒక జీవుడను గొప్ప కవిని గొప్ప పండితుడను యేమాత్రముము గాను.

నా పూర్వ జన్మలోని పుణ్య ఫలవశమున ఒకానొక మిత్రుని సహకారమున శ్రీ శ్రీ శ్రీ స్వామి ప్రబోధానంద యోగీశ్వర సద్గురు దేవుల శిష్య సంఘమున ఒకడనై, శ్రీవారి దివ్యతత్త్వోపదేశములకు నా లోని అజ్ఞానము అంతరించుచుండగ ఒక చిన్న పుస్తకము పద్య రూపంబున వ్రాయదలచి తత్ ప్రయత్నము జేయగ గురుదేవుడు నాయందు జేరి తెలిపి వ్రాయించిన విధముగ వ్రాసి ప్రబోధ శతకము అను పేరిడి శ్రీ స్వాములవారి పాదపద్మములకు అంకితము జేసి చరితార్థుండ నైతిని.

ఈ శతకమందు పద్యములన్నియు కేవలం సరళభాషలో యున్నవి. సామాన్య చదువరులకు అర్థమౌ నిమిత్తము భాషలెట్లున్నను భావమే ముఖ్యమను తలంపుతో వ్రాయడమైనది. నేను ఈ ప్రపంచములోనున్న కవులు, పండితులు, జ్ఞానులకన్నా అతితక్కువవాడను. కావున యిందులో భాషాలోపములున్నను మరియే యితర లోపము లున్నను వాటిని క్షమించి ఇందలి తత్త్వభావమును గ్రహించి నన్నాశీర్వదింతురని ప్రార్థించుచున్నాను.

ఈ కాలమున ప్రజలు గురువులన్న యెవ్వరో తెలుసుకోక చెడిపోవుచున్నారు. జ్ఞానశూన్యు లైన కొందరు మానవులు స్వార్థపరులై గడ్డములను, కాషాయాంబరములు ధరించి జెడలను పొడువుగా పెంచుకొని మేమే గొప్ప గురువులమనుచు ప్రజలకు మాయ మాటలతో మచ్చుజల్లి వారికి విగ్రహారాధనలు గరపుచు దేవాలయాలు గట్టింతుమనియు, దేవతా ప్రతిష్టలు

జేతుమనియు చెప్పుచు వారిచే ధనము గుంజి నిష్ప్రయోజనమైన వాటికి వ్యయము చేయుచున్నారు, వాటివలన జనులకు యే ఉపయోగము లేకపోగా

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేభరమ్
తం తమే వైతి కౌంతేయా సదా తద్భావ భావితః

అని గీతాచార్యుడు బల్కిన విధముగ యెవ్వడైతే తన అవసానదశలో యే భావమును స్మరించుకొనుచు దేహమును వీడునొ తిరిగివాడు ఆ భావమునకు సంబంధించిన జన్మనే బొందును. కావున భక్తియను పేరున శిలావిగ్రహములకు, చెట్లకు, పుట్లకు మ్రొక్కుచున్న వారెవ్వరైనను అంత్యకాలమున వాని కవియే జ్ఞప్తి గల్గి మరుజన్మమున వారి జీవాత్మ వాటి యందే జేరి విగ్రహములుగా మారుట తథ్యము.

పూర్వము గొప్ప జ్ఞానులు దేవళములను, అందు దేవతా ప్రతిమలను అందుచేయు పూజావిధానములను, కేవలం పరమాత్మ జ్ఞానమును గలుగజేయుటకు నిఘూడ సాంకేత సాధనములుగా మాత్రమే బెట్టియుండ నేడు అజ్ఞానులైనవారు వాటిని యే మాత్రము గ్రహించక నిరంతరము వాటిని పూజించుచు, అనేక కోర్కెలు కోరుకొనుచు, అసలు అందున్న అర్థమును గ్రహించక మూఢులై చెడి పోవుచున్నారు.

ఎవ్వరైన కొంచెము జ్ఞానము తెలిసినవారు ఇది పద్ధతిగాదని చెప్పిన సాకారము లేనిదే నిరాకారము ఎట్లు దొరుకునని అంటున్నారు. సాకారుడైన సద్గురుని జేరి వారిని పూజించి వారిచే జ్ఞానము తెలుసుకొని నిరాకారుని గనవలయును గాని సాకారపూజ అనుచు బండరాతి విగ్రహములకు వారు చచ్చువరకు పూజ చేసినను జ్ఞానము కొంచమైనను గలుగక ఏనాటికి ముక్తిని పొందజాలరు.

ఇట్లు,
శ్రీ స్వామి ప్రభోధానంద పాదదాసుడు,

వి. వీరబ్రహ్మం, బి. పప్పూరు పోస్ట్.

నా మాట

ఈ కాలములో శతకము లెన్నో గలవు. శతకములలో చాలా భాగము జ్ఞానమును బోధించునవియే యున్న వి. అటువంటి శతకములలో ఈ ప్రబోధ శతకము కూడ ఒకటి. ఈ శతకము ఎన్నో మూఢ నమ్మకములను ఖండించుచు సక్రమమైన జ్ఞానమార్గమును సూచించుచున్నది. ఈ శతకమును వ్రాసిన రచయిత జ్ఞానమును జీర్ణించుకొని, అందుకు ఫలితముగ శతకమును వ్రాసాడు. ఈ శతక రచనలో ఈయన కవియేగాక జ్ఞాని అని కూడ నిరూపించుకొన్నాడు.

నేను భక్తిని బోధించు శతకములనెన్నో జూచాను. ఆత్మలింగ శతకము తప్ప మిగతా శతకములను వ్రాసిన వారు కేవలము కవులేగాని జ్ఞానులు మాత్రము కారేమోననిపిస్తుంది. ఎందుకనగా! వారి బోధనలందు విష్ణు,ఈశ్వర,బ్రహ్మ మొదలగు దేవతలలో సాక్షిభూతుడయిన పరమాత్మను తెలుపక కేవలము విష్ణువునో,ఈశ్వరుడనో గురించి బోధించుచుందురు. ఒక్క చోట వైకుంఠమని,ఒక్క చోట మోక్షమని, ఒక్కచోట తపస్సని, ఒక్కచోట యోగమని వైకుంఠ మోక్షములకు, తపస్సు యోగములకు బేధము లేనట్లు తెల్పుచుందురు.

ఒక్క మార్గమునే చివరివరకు బోధించక అనేక మార్గములను బోధించుచు ఏ మార్గమునను సరింపవలయునో అర్థము కానట్లు చేసారు. జ్ఞానదృష్టిలేని కవులు జ్ఞానులమనుకొని అసలైన జ్ఞానులనే లెక్కచేయక, జ్ఞానశక్తి తమయందు ఏ మాత్రము లేకున్న కవిత్వగర్వముచే జ్ఞానశక్తియున్న వారి మాటలనే కించపరుస్తున్నారు. అటువంటివారు కవిత్వమునుపయోగించుకొని జ్ఞానవిషయములను వర్ణించిన అది ఎంతో వక్రమార్గముగ యుండును. ప్రతి ఒక్కచోట తప్పు దొరుకునదిగనే యుండును. ఉదాహరణకు బావిలోని పాచిని రాయివేసి ప్రక్కకు తొలగింప కొద్దిసేపటికి మళ్లి కప్పు కొనులాగున నిర్వికల్ప సమాధియందు లేని మాయ సమాధి వీడగనే తిరిగి ఆవహించు నన్నాడొకాయన. ఆ మాట క్రిందనే బావిలోని పాచిని బావిగట్టున వేయగ ఎండి నాశనమై కనిపించక పోయినట్లు తాను తానయి ఆత్మ నిష్టలో' నిల్చిన ఎప్పుటికి మాయ కనుపించదు అని ఆయనే అన్నాడు. ఇక్కడ పైమాటకు క్రిందిమాటకు పూర్తి వ్యతిరేఖముగ యున్నది. ఒక చోట మాయ తిరిగి దర్శనమిచ్చునని ఒక చోట ఇయ్యదని వ్రాయబడినది. ఈ విధముగ ఈ కాల రచనలుండును.

ఈ ప్రబోధ శతక రచయిత జ్ఞాని కాని కవిగాక, జ్ఞాని అయిన కవి అని తన రచనలో నిరూపించుకొన్నాడు. ఇక మీదట జ్ఞానమును తెలిసిన కవులు జ్ఞానమునే పద్యరూపముగ వర్ణించితే బాగుండునని కోరుచు ముగించుచున్నాను.

ఇట్లు,

శ్రీ గురుపాద రేణువు,

పొత్తూరు పుల్లయ్య, తేరన్నపల్లె.

ప్రశంస

ఉ. ఈకవి వర్యుదుజ్వలు దహీన గుణాకరుడాత్మతత్త్వమున్
వీక నెరుంగ గోరి, కదు విశ్రుతకీర్తి ప్రబోధ సద్గురున్
జేకొని తన్మహాకృపను చిన్మయ మూర్తి నెరుంగు మార్గమ
స్తోక గుణాకరుండుగనె, సుస్థిర చిత్తముతోడ దిట్టయై. 1

కం॥ వీర బ్రహ్మకులంబున
సారమతిన్ జనన మంది సజ్జన హితుడై
వీర బ్రహ్మాభిధనిం
పారెడు నీతండు గురు కృపను సంతతమున్. 2

అ. సకల జగము మిధ్య సత్యంబు బ్రహ్మంబు
అనెడు వేద వాక్య మాత్మ నిలిపి
అలఘు మతిని పెద్దలగు వారి సేవించి
సత్పథమున నుండె సాధుగుణుడు. 3

తే. శబ్ద శాస్త్రంబు సాహిత్య సరణి నెఱుగ
జాలకున్నను సంస్కార మూలమునను
కైత వ్రాయంగ బూనె నిక్కని వరుండు
దొనగులున్నను పెద్దలుత్సుకత గనుడు. 4

సిద్ధా వెంకటస్వామి, నార్పల.

ఓం గురవేనమ:

గురుస్తోత్ర పంచకము

ఆ॥ వె॥ విపుల శాస్త్రజ్ఞాని వేదాంత వేద్యుడు
బ్రహ్మ తేజవదన భాసితుండు
సత్య శాంత రూప సద్గురు మూర్తిని
శ్రీ ప్రబోధ గురుని చేరి గొల్తు. 1

ఆ॥ వె॥ అమృతంబు వంటి ఆత్మ బోధన వృష్టి
శిష్య గణముపైన చింద జేసి
మృత్యు భయము తీర్చు అత్యున్న తాత్ముని
శ్రీ ప్రబోధ గురుని చేరి గొల్తు. 2

ఆ॥ వె॥ జిహ్వ మీద వాణి జెలువార భక్తుల
కాత్మ బోధ గరుప నలరువాడు
ముక్తిదాత యైన శక్తి స్వరూపుని
శ్రీ ప్రబోధ గురుని చేరి గొల్తు. 3

ఆ॥ వె॥ కోటి జన్మలందు గూడిన కర్మల
జ్ఞాన ఖడ్గ మిచ్చి నరుక నేర్ప
దివ్య బోధ చేయు ధీవిశారదుడైన
శ్రీ ప్రబోధ గురుని చేరి గొల్తు. 4

ఆ॥ వె॥ పాప భారమవని బాపంగ దలపోసి
జన్మ మెత్తి నట్టి సాధుమూర్తి
కర్మ రహితుడైన కరుణా సముద్రుని
శ్రీ ప్రబోధ గురుని చేరి గొల్తు. 5

ఓం

ప్రబోధ శతకము

ఆ. వె: శ్రీ ప్రబోధ గురుని చిత్తమందున నిల్పి
వ్రాసినాడ పద్యరచన జేసి
తప్పులున్న నిందు దలుపక దయతోడ
భావ మరయుడయ్య భక్తులార. 1

ఆ. వె: కరుణతో ప్రబోధ గురుమూర్తి నాలోన
చేరి యీ ప్రబోధ జేయగాను
వ్రాసినాడ నాదు రచనేమి గాదిది
చదివి భావమరయ సంతసింతు. 2

ఆ. వె: శ్రద్ధచే ప్రబోధ శతకంబు రచియించి
శ్రీ ప్రబోధునకు ప్రేమ మీర
అంకితంబునిచ్చి తాత్మార్పణంబుగ
ముక్తి నొసగి మమ్ము బ్రోచు కొరకు. 3

ఆ.వె: కవినిగాను నేను కావ్యంబులల్లంగ
పండితుడనుగాను భాష నెఱుగ
గురువు కరుణవలన గుర్తించితీ బోధ
తప్పులున్న సైచి దయను గనుడు. 4

ఆ. వె: తప్పులేనివారు ధరనెవ్వరును లేరు
పట్టవచ్చు తప్పు బ్రహ్మనైన
తప్పులెంచుముందు తమ తప్పు గనవలె
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 5

ఆ. వె: గురువునందు భక్తి గూర్చిన మనముతో
పాదసేవ జేయ పరమ ప్రీతి
తత్వబోధ జేసి తరియింపజే యును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 6

ఆ. వె: చిత్తమందు నున్న చింతలు విడనాడి
సద్గురువుల బోధ శ్రద్ధ మీర
విన్నవారు బంధ విముఖులౌ చుందురు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 7

ఆ. వె: గురువు యెట్టివాడొ, గుర్తింపగా రాదు
తాను సర్వమయుడు దలచి చూడ
గురువు గుర్తు తెలియ గురువె కావలయును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 8

ఆ. వె: ఎవ్వరెవ్వరి ఫలమెంతెంతనుండునో
అంత గురువు వారి కమరుచుండు
వేరు గురువు చెంత జేరంగ లేరయా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 9

ఆ. వె: శవము పైన గోరి చక్కగా గట్టించి
పిల్తురే సమాధి పేరు పెట్టి
మనసు లయముగాక మరి సమాధెట్లగు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు.10

ఆ. వె: పుణ్య తీర్థమనుచు మున్గి తేలినయంత
పాపకర్మలన్ని బాసి పోవ
అందు జీవరాసి కట్లేల జరుగదు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 11

ఆ. వె: తర తరంబులైన తత్వంబు గనరాక
తరచి తరచి ఘనులు తల్ల డిల్ల
తలలు గుండ్లు కొట్టి తరియింప జూతురే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 12

ఆ. వె: కోర్కెలెన్నొలోన కోలాటముల నాడ
మాటలన్ని మాని మౌన మూన
సాధ్యమగునె ఆత్మ సన్నిధి జేరంగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 13

ఆ. వె: సంతలోన కోతి వింతజేసిన రీతి
బాహ్య వృత్తులందు బరగు మనసు
బట్టి గట్టు నతడె పరమ యోగీంద్రుడు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 14

ఆ. వె: ఇంద్రియముల సుఖము కింతిని బెండ్లాడి
సుతులగాంచి వారి గతుల కొఱకు
వెతలు పడుచు జనులు మతిహీనులౌచుంద్రు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 15

ఆ. వె: గతుల కొరకు సుతులగాంచి పోషింతురు
సుతులు వారి గతుల జూడకున్న
వంత జెంది జెంది గుంతపాలౌదురు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 16

ఆ. వె:పుత్రహీనులైన పున్నామ నరకంబు
గల్గు ననుచు చాల కలత యేల
పుత్ర భ్రాంతి మోక్ష శత్రువు గాదొకొ
అరయడీ ప్రబోధ గురుని గనుడు. 17

ఆ. వె: భార్య పిల్లలనుచు బాయని మోహాన
మున్గి తేలు చున్న మూర్ఖమతులు
ఆత్మ దూరులౌచు నగచాట్లు బడుదురు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 18

ఆ. వె: కుత్సితంబులెన్నొ గుట్టుగా జేయుచు
మంచి వారి వలెను మసలుచున్న
మంచి చెడ్డలన్ని మహితాత్ముడెరుగడా
అరయుడి ప్రబోధ గురుని గనుడు. 19

ఆ. వె: పాదరసము రీతి బరిగెత్తు మనసును
నిల్పకష్టమెంత నేర్పరికిని
నిల్పె నేని వాడె నిర్మలుడగు యోగి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 20

ఆ. వె: ఆసనాలు నేర్వ అచలంబు సిద్ధింప
దొమ్మరీల కేల దొరుక కుండె
మనసు నిల్పుటొకటె మార్గంబు ముక్తికి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 21

ఆ. వె: కూటి కొరకు జనులు కోటి వేషము లేసి
కాని పనులు జేయ కాల యముడు
మట్టు బెట్టు వారి మరుజన్మనందైన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 22

ఆ. వె: భోగ భాగ్యమెంతొ బాగనున్న దటంచు
విర్రవీగనేల వెర్రిచేత
ముందు జన్మలందు పుణ్యఫలంబది
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 23

ఆ. వె: అచల మతమటంచు నజ్ఞానవశమున
బలుకుచున్న నేమి ఫలము గల్గు
అచలుడైన వాడు అరయునా అచలంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 24

ఆ. వె: మాది అచలమంచు వాదించుచుందురు
దాని అర్థమేమొ దలుపరైరి
అచలు డంతటుండియవ్యక్తుడగుజుమీ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 25

ఆ. వె: దారులెన్ని యైన చేరు గమ్యమొకటె
మతములెన్నియైన మనుషులొకటె
భాషలెన్నియైన భావమొక్కటె గదా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 26

ఆ. వె: చీకటనెడి మాయ బోకడంచుటచేత
జ్యోతి యనిరి దాని శ్రుతులయందు
దాని పేరదేమొ? దానికే తెలియదు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 27

ఆ. వె: కోటి సూర్యప్రభల సాటియైన దటంచు
పండితులగు వారు బల్కినారు
దాని గన్న వారి తరమౌనె దెల్పంగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 28

ఆ. వె: మాయదాటలేని మానవాళి కెపుడు
తెలియరాదు నిజము తెల్లముగను
జలధి మున్గియున్న జగము గన్పించునా!
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 29

ఆ. వె: పూజ జేయ గుడికి బోయిన వారలు
గంటకొట్టి మ్రొక్క కారణంబు
నాద మందు మనసు నైక్యంబు జేయనే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 30

ఆ. వె: నాదము మదియందు నాటిన వారికి
చిత్త భ్రమలు దీరు శీఘ్రముగను
అట్టి పూజ చేత నాత్మైక్య మబ్బును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 31

ఆ. వె: ప్రజల మెప్పు బడయ భక్తుని చందాన
నుదుట బొట్లు బెట్టి నుతుల బొంద
భక్తుడంచువాని భగవంతు డొప్పునా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 32

ఆ. వె: బాధ గల్లినపుడె భగవంతు నవసర
మొచ్చి గొలుచుచుందు రెచ్చుగాను
బాధ తీరిపోవ భారమౌ దలపంగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 33

ఆ. వె: మాయ శక్తి కెట్టి మహిమగలదొ గాని
యెట్టి మహితునైన బెట్టు వంత
మూర్ఖ మతుల నైన ముంచక విడచునా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 34

ఆ. వె: మాల మాదిగలని తేలిక గొననేల
అత్మమాల దౌనె అరసి జూడ
దేహ మొదలి యందు దేహిని గనవలె
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 35

ఆ. వె: కులము తక్కువనుచు బలుకంగ నేటికి
మంచి గుణములున్న మాన్యుడతడె
గుణము లెన్న బోక కులమెంచ మేలౌనె
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 36

ఆ. వె: కులము గొప్పదైన గుణము లేకుండిన
మెచ్చ రెవ్వరైన మేధి నందు
బుద్ధి మంచిదైన పుజింపరేవాని
అరయుడి ప్రబోధ గురుని గనుడు. 37

ఆ. వె: మెడను తులసి సరులు మెండుగా ధరియించి
బూది పూతలెన్నొ పూసికొన్న
మమత విడువరేని మార్గంబు గనలేరు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 38

ఆ. వె: మూడునామములను ముక్కుపై దిద్దుచు
అందునున్న మర్మమరయకున్న
మతము గుర్తు కొఱకొ మరి భూషణమునకో
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 39

ఆ. వె: ఫాల భాగమందు పట్టె వర్ధనములు
బెట్టి నంతయగునె పెద్ద శివుడు
శివము గూడ వాడు చిద్రూపుడైవెల్గు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 40

ఆ. వె: చావు తప్పిపోదు సంతాప పడినను
గురుని చెంత జేర కరుణ తోడ
చావు భయము దీర్చి సద్గతి జూపును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 41

ఆ. వె: నీటి బుడగ వంటి నిలువని దేహంబు
ఎప్పుడంతమగునొ యెఱుగ రెవరు
ఆయువున్న యపుడె అచల సిద్ధి గనుము
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 42

ఆ. వె: నాశమున్న దాని నమ్ముచు జనులెల్ల
ఆత్మ తృప్తి బొంద నాశ పడగ
దూరమైన యపుడు దుఃఖంబు గలుగదా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 43

ఆ. వె: నాది నాది యంచు నల్లాడుచుందురు
వెళ్లి పోవునాడు వెంటవారు
గడ్డి పోచనైన గట్టుక పోదురా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 44

ఆ. వె: ఇంద్రియాలనేంతొ యిచ్ఛతో బంధించి
పారుచున్న మనసు బట్టి కట్ట
తలపులేక ఎరుక తన్నుదా నెరుగును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 45

ఆ. వె: విత్తు చేత చెట్టు వెలసిన రీతిగా
కర్మవలన జన్మ గలుగుచుండు
జన్మ కర్మములను జగమెల్ల వెలసెరా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 46

ఆ. వె: కర్మ దీర్చుకొనగ కాయమందుండును
కర్మమున్న వరకు కాలముండు
కర్మ దీర జీవి కాలమై పోవును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 47

ఆ. వె: స్వర్గమన్న దొకటి సౌఖ్య మనుభవింప
పైననున్న దనుచు పల్కుచున్న
ఎవ్వరైన చూచి యీ రీతి జెప్పిరే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 48

ఆ. వె: పుణ్యబలము గూడి పుట్టిన వారికి
సకల సౌఖ్యములిల జరుగుచుండు
నది విరుద్ధమైన నరకంబు తప్పదు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 49

ఆ. వె: నరకలోకముండు నచ్చట యముడుండు
నరుల హింస బెట్టుననెడి వారు
అటకు పోయి చూచి అవనికి వచ్చిరా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 50

ఆ. వె: ఆత్మ యముడు నగుచు నన్ని జీవులకును
కర్మ బట్టి వారి కష్ట బెట్టు
నట్టి స్థలమె యగును నరకలోకంబన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 51

ఆ. వె: పాము తేళ్లు కుట్టి బాధతో రోదింత్రు
ఎందుకట్లు జరిగె నెవరు గనరు
కాల కింకర లవి గావేల యోచింప
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 52

ఆ. వె: అంగ భంగమైన నంగలార్చుచు నరుల్
దేవు నెంతగానొ దెప్పుచుంద్రు
వెనుక పాప కర్మ వెతలంచు తెలియక
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 53

ఆ. వె: వారి వారి కర్మ మేరకు ప్రాణులు
తిరుగుచుందురట్టి తీరుగాను
తప్పి పోదు కర్మ రెప్పపాటైనను
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 54

ఆ. వె: బ్రహ్మయోగమందు పరమ సిద్ధుండైన
కర్మ దొలగి వాని కాయమందు
నిర్వి కల్ప విధిని నిశ్చలస్థితి నుండు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 55

ఆ. వె: చలనములను మాని చక్కగా చిత్తంబు
 కన్ను బొమల మధ్య కాపు బెట్ట
చలన మిచ్చు వాడు చయ్యన జిక్కును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 56

ఆ. వె: చిత్త మందున్న చింతలు మానిన
గంట నాద మొకటి వెంటనుండు
 నాద మంటి యుండ నాత్మను జేర్చదా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 57

ఆ. వె: మాడు లోన నున్న మూడు గుణంబుల
మధ్య జీవు డుండి మనసు చేత
చిత్రమైన విషయ చింతలు గనుచుండు
 అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 58

ఆ. వె: మూడు రంగులున్న ముచ్చ టౌ పాపలో
 జ్యోతి ప్రభలు వెల్గు చోద్యముగను
ప్రభలు గన్న వాడె పరమార్థ వేది యో
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 59

ఆ. వె: అన్ని ప్రాణులందు నంతరాత్మ యొకటె
కన్ను లందు వెల్గు కాంతియొకటె
యెన్న రూప గుణము లెన్నెన్నొ యున్నవి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 60

ఆ. వె: పందిమేని పైన పన్నీరు జల్లినా
బురదయందు బొరల పరుగులెత్తు
పోకిరికిని జ్ఞాన బోధలిట్లుండును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 61

ఆ. వె: బ్రతుకు భారమైన భగవంతుడా మాకు
భాగ్యమిమ్మనుచును భక్తి జేసి
భాగ్యదశనునున్న పలుకరు నోటైన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 62

ఆ. వె: మంటి కుండవంటి మానవ తనువిది
ఎపుడు శిథిల మగునొ యెరుగరాదు
వూపిరుండగానె వుపదేశమందుడు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 63

ఆ. వె: లోభి తనముచేత లాభంబు లార్జించి
కోటి కోట్ల ధనము కూడబెట్ట
కూటి కొఱకుగాక కాటికి వచ్చునా?
అరయుడీ ప్రబోధ గురుని గను. 64

ఆ. వె: మాయ పంట తనువు మసిగాక తప్పదు
మురిపె మేల దీని ముద్దుజేయ
మంచి చెడ్డలెంచి మహిలోన జెలగుడు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 65

ఆ. వె: అత్మ శాంతి గోరి యడవుల బడియందు
ఆకులలములుదిని అలయుటేల
అహము విడచినంత ఆనందమొందరె
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 66

ఆ. వె: తపము తపమటంచు తర్కించుచుందురు
తపన లేని వాడు ధాత్రి గలడె
తాప మొదలి వేయ ధన్యుండు గాడొకొ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 67

ఆ. వె: చెట్టు పుట్టల కడ జేరి మ్రొక్కుచునున్న
అంత్యకాలమందు అవియె దోచి
పుట్టు వాని రూపె గిట్టిన తదుపరి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 68

ఆ. వె: మాటలేమి లేని మట్టి బొమ్మలకును
మ్రొక్కుచున్న జ్ఞాన మొచ్చు టెట్లు
సిద్ద గురుని జేర సిద్ధించు జ్ఞానంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 69

ఆ. వె: కాళ్ల క్రింద దొక్కు రాళ్లను గొనివచ్చి
ముక్కు మొగము చెక్కి మ్రొక్కనేల
ముక్కు పైన గలదు మ్రొక్కుడు దైవంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 70

ఆ. వె: అమ్మ వారి శక్తి కాహుతిగా నెంచి
జంతు బలుల జేసి సంతసింత్రు
అమ్మ దినగ నెంచ ఆగునా విశ్వంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 71

ఆ. వె: శక్తి శాంతి కనుచు జంతు జాలంబుల
గొంతులెల్ల గోసి కొలుచుచుంద్రు
శక్తి గుడువ బెట్ట శక్యంబె నరులకు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 72

ఆ. వె: పాము శిల్పములను పాలచే పూజించి
జీవమున్న వాని చావ మోద
ఫలితమేమి గల్గు పరమార్థ మెట్లగు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 73

ఆ. వె: బండచే మొలచిన బసవన్న బొమ్మను
పత్రి చేత గొల్చి భక్తి తోడ
బ్రతికియున్న వాని, బాధింతురేలనో
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 74

ఆ. వె: కట్టెద్దలమయ్యె కార్యంబు జెడునంచు
కలత జెందనేల నిలను జనులు
కర్మ ఫలితమున్న కట్టెలు గాల్చునా
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 75

ఆ. వె: కావిరంగు వలువ కాయాని కతికించ
కర్మదొలిగి వారు గాంచ ముక్తి
అశ్వములకు మోక్ష మవలీల జిక్కదే!
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 76

ఆ. వె: ఒక్క ప్రొద్దులనుచు నొడలు చెడుపగనేల?
కుక్క వంటి మనసు జిక్కబట్ట
చిక్కు ముక్తి కాంత చింతలు దీరగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 77

ఆ. వె: దారి కెదుట విధవ దర్శనంబైనచో
పనికి భంగమంచు బలుకుటేల
విధి విధంబు నెట్లు విధవలు మార్తురు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 78

ఆ. వె: చిత్తమునకు నాత్మ చింతనంబును బెట్టి
భజన యంచు బలుక పాడియగును
చేతు లదర గొట్టి చేయంగ ఫలమేమి?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 79

ఆ. వె: కుంకుమార్చనంబు గుండ్రాళ్ల కుంజేసి
పెద్ద దేవతలని సుద్దులాడ
రాయి దేవతైన రాజ్యాలనేలదా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 80

ఆ. వె: సన్యసించితి నని సంసారమును వీడి
దేశ ద్రిమ్మరియయి దిరుగనేల?
భావ మందు మోహ భావంబు వదలుడు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 81

ఆ. వె: భ్రాంతి దయ్యమునను బహుచింత బడనేల
మంచి గురుని వెదకి పంచజేర
మంతరించి దాని నతంబు జేయడే?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 82

ఆ. వె: నియమ నిష్ఠలందు నిలువ లేకున్నను
ఆత్మ శుద్ధి గల్గి అలరుచున్న
దైవ మట్టి వారి దరిజేర్చుచుండును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 83

ఆ. వె: హీన కులజుడైన జ్ఞాన సంపదయున్న
వన్నె కెక్కు వాడు వసుధయందు
పసిడి గాదె ఇనుము పరుసంబు సోకిన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 84

ఆ. వె: జ్ఞాన బోధలన్న నచ్చవు ఖలులకు
బూతులాడు చున్న బుట్టు ముదము
గార్దభంబు మంచి గంధంబు మెచ్చునా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 85

ఆ. వె: హితవులాడు వారి నిందింతురందరు
కల్ల లాడెనేని గౌరవింత్రు
కల్ల నిజము గనరు కలికాల మహిమచే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 86

ఆ. వె: చావు గల్గు వరకు సౌఖ్యంబులందిన
తరుగబోక నిచ్చ బెరుగు గాని
విషయ సుఖము విడువ వెసగును సౌఖ్యంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 87

ఆ. వె: భక్తి భావమనుచు బంగాకు పొగ త్రాగ
బింగి రేగి వాడు బిత్తరౌను
మత్తు త్రాగ మదికి మార్గంబు దోచునా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 88

ఆ. వె: దైవ తత్వ మరయ దైవజ్ఞులగువారు
అర్చనంపు విధుల నమర జేయ
తంతు లాయె నవియు దలపులు గోరంగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 89

ఆ. వె: దైవ మెక్కడంచు దరచంగ నేటికి
అన్ని ప్రాణులందు నతడు గలడు
అతడు లేక యున్న నణువైన కదలునా?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 90

ఆ. వె: భూత పంచకమున బుట్టును చరమంత
స్థితిని బొందు వాటి జేతనమున
చంపునవియె నట్టి సమయమేతెంచిన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 91

ఆ. వె: ముట్టరాదు మమ్ము ముట్టైతి మందురు
ముట్టు లోన గాదె బుట్టె తనువు
ముట్టు గుట్టు లేవొ మూర్ఖ లెరుంగరు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 92

ఆ. వె: జన్మలగ్న మెంచి జాతకంబుల పేర
కర్మ నడక జెప్ప గలగి నపుడు
మరణ లగ్న మెంచి మరుజన్మ గనరేమి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 93

ఆ. వె: బాహ్య విద్య లెంత బాగుగ నేర్చినా
బ్రతుకు గడుపు వరకె పనికి వచ్చు
అంత్య కాలమందు నవియెల్ల నశియించు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 94

ఆ. వె: ఆది లేదు జూడ అంత్యంబు గనరాదు
బట్ట బయలు దాని పట్ట తరమె
అంతరంగ మందు చింతింప దొరుకును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 95

ఆ. వె: జలములందు చేప జరియించు రీతిగా
సత్వ తేజమందు సకలప్రాణి
మసలుచుండు దాని మర్మంబు గనలేక
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 96

ఆ. వె: తామస గుణమున్న తత్వవేత్తయుగాడు
రాజ సుండు గాడు రాజయోగి.
సాత్వికుండు ముక్తి సాధించి నెపుడైన
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 97

ఆ. వె: ఫణిని బట్టి తెచ్చి బంధించ బుట్టలో
 మూత సడల పారు బుస్సు మనుచు
సాధకుని మనంబు సాధించు నీ రీతి.
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 98

ఆ. వె: పుణ్య మబ్బు ననుచు బూని దానముజేయ
ఘాతుకంబుల కది యూతమైన
దాన గల్గు నఘము దాతకు తథ్యంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 99

ఆ. వె: దాన మిచ్చు దాత దలుపక పాత్రత
 చేసెనేని యఘము జెందునతడు
 పాత్ర తెరిగి జేయ ఫలమెంతొ బొందును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 100

ఆ. వె: విద్యలందు బ్రహ్మ విద్యయే మేటి యో
యోగములను రాజ యోగ మెచ్చు
 దానములను జ్ఞాన దానెంబె గొప్పది
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 101

ఆ. వె: తనువు మీద నున్న నెనరు చేతనుగాదె
మరణమన్న భయముమనుజులకును
తనువు మారుగాని తను మారునే జూడ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 102

ఆ. వె: పట్టెడన్న మిడగ బ్రతికిన పెద్దలన్
 చీదరించు చుంద్రు బాధ గలుగ
మరణమైన వెనుక మానరు శ్రాద్ధముల్
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 103

ఆ. వె: ఎచటనుండి ఇచడి కేతెంచెనో జీవి
అచటి కేగువరకు ఆగదెపుడు
నడుమ జన్మలెత్తి యిడుమలు బడనేల?
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 104

ఆ. వె: తల్లి కడుపు వీడి తనువూడి పడినంత
జీవు డెచటి నుండొ జేరి యందు
వింత కొంత జేసి వెళ్లు నెచ్చోటికో
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 105

ఆ. వె: పాప పుణ్యఫలము ప్రజ్ఞచే గూడంగ
బుద్ధి నట్టి క్రియల బొరల జేసి
కష్ట సౌఖ్యములను గలిగించు జీవికి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 106

ఆ. వె: ఏడు గిరులపైన జూడగ నొక కన్య
నాగస్వరము నూదె నలుపు లేక
పుట్టలోన పాము బుసకొట్టి యాడెను
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 107

ఆ. వె: ఆడుచున్న పాము నాట గట్టించగ
నాదమగు నచటి నతివ జిక్కు
ఆమె పొందు జేయు నాతడే ఘనయోగి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 108

ఆ. వె: ఇంట నాడు దాని నెంతటి వాడైన
పట్టి నిలుప లేడు గట్టిగాను
పట్టి నిలుపువాడె పరమాత్మ రూపుడు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 109

ఆ. వె: చింతమాను వెనుక చిత్రమౌ తీగకు
పువ్వులేదు విరిసి పొందుగాను
పూవు పూవు నడిపె భూత జాలంబుల
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 110

ఆ. వె: ఎల్ల వేళలందు యెఋుకచే కుండలి
ప్రాణి కోటి నెల్ల బట్టి నడుప
నిదురనున్న దనిరి నిజమౌ నె దలుపంగ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 111

ఆ. వె: మాతృ గర్భమందు మావి నుండి శిశువు
ధరణి పైన పడిన తక్షణంబె
జీవుడందు జేరి జీవించు శ్వాసచే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 112

ఆ. వె: ఒక్క చోట ప్రాణ మూడిన యంత నిం
కొక్క చోటు బుట్టు నిక్కముగను
ఒక్క ప్రాణి బుట్ట నొక ప్రాణి గిట్టును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 113

ఆ. వె: మనసు బ్రహ్మమందు మగ్న మైనంతనె
అంతమగును జగము లంతలోనె
సృష్టి గల్గు మరల సూర్య చంద్రుల గూడ
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 114

ఆ. వె: మొదటి శ్వాసతోడ మొదలౌచు జన్మంబు
అంత్య శ్వాసతోడ నంతరించు
పుట్టు గిట్టు లిట్లు భువిలోన జరుగును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 115

ఆ. వె: శ్వాస నిలువ మనసు చలనంబు నిలచును
మనసు నిలువ శ్వాస మాను నవుడె
శ్వాస మనసు లిట్లు జరియించు మైత్రిచే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 116

ఆ. వె: నిదురలేక యున్న నిఖిలంబు గనవచ్చు
నిదురలోన నున్న నిజము గనరు
నిదురలోన నెరుగు నిజయోగి సర్వంబు
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 117

ఆ. వె: నటుడు పాత్ర బూని నటియించు రీతిగా
మెలగు చుండు యోగి మెలు కువగను
భార్య పిల్లలున్న భయమేమి వారికి
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 118


ఆ. వె: సర్వ జీవులందు సంగతాత్ముని గని
అంతరంగ మందు నతని గొల్వ
పంతబెట్టు మాయ చింతించి బారును
అరయుడీ ప్రబోధ గురుని గనుడు. 119

ఆ. వె: గురువు శిష్యునందు గుణ గణంబుల బట్టి
వాని కట్టి తీరు గానుపించు
అసలు గురువు రూప మరయంగ సాధ్యమే
అరయుడీ ప్రబోధ గురుని గనుడు . 120

ఆ. వె: మౌఢ్య మతములన్ని మదిలోనే వీడియు
గురుని దరిని జేరి శరణు వేడి
అతని దివ్యకృపను ఆత్మనెరింగియు
పరమ పదము గనుడు భక్తులార. 121

ఆ. వె: సతతమీ ప్రబోధ శతకంబు భక్తి చే
పఠన జేయువారి పాపకర్మ
సత్వరంబె బాపి సద్గతి గలిగించి
బోచుగాక శ్రీ ప్రబోధ గురువు. 122

ఆ. వె: మంగళం ప్రబోధ మహనీయ గురునకు
మంగళంబు శిష్య మండలికిని
మంగళంబు భక్త మాన వాళికి నెల్ల
మంగళంబు నిత్య మంగళంబు. 123


ప్రబోధానందుని సాంఖ్య సూత్రము
(5) జ్ఞానేంద్రియములు
కన్ను
EYE
చెవి
EAR
నాలుక
TONGUE
ముక్కు
NOSE
చర్మము
SKIN
మనస్సు
MIND
తామసము
రాజసము
RAJASA
సాత్త్వికము
SATTVA
అహము
THOUGHT
JEEVA

ఓం గురువేనమ:

ప్రబోధాశ్రమ ప్రచురణలు

గ్రంథము	వెల
1. ప్రబోధ	15-00.
2. జననమరణ సిద్ధాంతము	2-50.
3. ప్రబోధ శతకము	1-00.

త్వరలో ప్రచురణకు సిద్ధముగనున్నవి.

1. సుబోధ
2. ప్రబోధానంద గీత
3. నిఘూడ తత్వార్థ బోధిని

పుస్తకములు కావలసినవారు క్రింది అడ్రసుకు వ్రాయవలయును.

వి. పి. పి. చార్జి అదనము

శ్రీ స్వామి ప్రబోధానంద యోగీశ్వరులు

ప్రబోధాశ్రమము

తాడిపత్రి - 515411.

శ్రీ రమా భారతి ప్రెస్, తాడిపత్రి